janodaya
# జనోదయ
RNI No - APTEL/2022/81596
కరీంనగర్ శనివారం 20.12. 2025 సంపుటి : 03 సంచిక : 19 పేజీలు : 08 వెల: రూ.5
Karimnagar Saturday 20.12.2025 Volume:03 Issue 19 Pages 08 Cost 5/
తెలుగు దినపత్రిక

## డీజీపీ ముందు లొంగిపోయిన 41 మంది మావోయిస్టులు



5

## భారత్ జయభేరి

పాండ్యా బ్యాటుతో, వరుణ్ బంతితో..

3-1తో సిరీస్ గెలుపొందిన టీమిండియా

5



### రామగుండంలో..

# బూడిద దందా?

## ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌పై బీఆర్ఎస్ నేతల విమర్శలు

- రోజూ రూ.35 లక్షలు చేతులు మారుతున్నాయని బీఆర్ఎస్ నేత వ్యాళ్ల ఆరోపణలు
- ఓ పక్క కూల్చివేతలు.. మరోపక్క అవినీతి ఆరోపణలు
- వెనక్కి తగ్గని ఎమ్మెల్యే
- కొనసాగుతున్న కూల్చివేతలు
- చాపకింద నీరులా ఎమ్మెల్యే వ్యతిరేక ప్రచారం

6







ఎమ్మెల్యే వర్సెస్ వ్యాళ్ల

# నియామకాల్లో పారదర్శకత ముఖ్యం

- 2047 వికసిత భారత్ లక్ష్య సాధనలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకం
- నియామకాల సవాళ్లను త్వరితగతిన పరిష్కరించాలి
- ఉద్యోగుల ఎంపికలో నిజాయతీకి ప్రాధాన్యమివ్వాలి
- చిత్తశుద్ధి విషయాల్లో అస్సలు రాజీపడొద్దు
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము




నియామకాల్లో పారదర్శకత, ప్రజల్లో విశ్వసనీయత పెంచడంపై దృష్టి సారించాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ల జాతీయ సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నియామకాల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని కమిషన్ చైర్మన్లకు స్పష్టం చేశారు. నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లను త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

5

### ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల

## పాలక వర్గాల రద్దు

### రేవంత్ ప్రభుత్వం కీలక నిర్ణయం



తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్లు, డైరెక్టర్ల పాలక వర్గాలను రద్దు చేసింది. అలాగే తొమ్మిది జిల్లాల డీసీసీబీలను సైతం తొలగించింది. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ డీసీసీబీల పాలకమండళ్ల కాల పరిమితి ముగియడంతో రద్దు చేసినట్లు తెలిపింది. ఈ మేరకు పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌ఛార్జిలను నియమించాలని వ్యవసాయశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ ఇన్‌ఛార్జిలు కొనసాగుతారని పేర్కొంది. ఈ ఏడాది ఆగస్టు 14వ తేదీతో పీఏసీఎస్‌ల పదవీకాలం ముగిసిందని ప్రభుత్వం వివరించింది.

# మణుగూరు ఓసీ 2 ప్రైవేటీకరణ అడ్డుకుంటాం

○సంక్షేమం పక్కనపెట్టి ఫుట్‌బాల్‌పై రూ.10 కోట్లు ఖర్చు

○సీఎం రేవంత్‌పై కవిత విమర్శలు

**భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 19:** ఆదివాసులు, గిరిజనులపై సీఎం రేవంత్ రెడ్డి , మంత్రి సీతక్క శ్వేతపత్రం విడుదల చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ పాలనలో ఆదివాసులు, గిరిజనులకు ఏం చేశారో వెల్లడించాలన్నారు. సింగరేణి పుట్టినిల్లు ఇల్లందులో కొత్త బొగ్గు బావులు మొదలుపెట్టాలని అన్నారు. సింగరేణి కార్మికులు సంక్షేమం కోసం కాకుండా సీఎం రేవంత్ ఫుట్ బాల్ కోసం పది కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో కొత్తగూడెంకు ప్రాధాన్యం లేదని విమర్శించారు. ఒక మంత్రి కొత్తగూడెంను దత్తత తీసుకోవాలని .. కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు పెంచాలన్నారు. మణుగూరు ఓసీ 2 ప్రైవేటీకరణ అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు నీళ్ల భద్రాద్రి జిల్లాలో పొలాలకు అందించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రాలో విలీనమైన ఎటపాక పురుషోత్తమ పట్నం, గుండాల, పిచుకులపాడు, కన్నాయిగూడెం గ్రామాలను భద్రాచలంలో కలపాలన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం ఐదు గ్రామాలను భద్రాచలంలో కలపాలని ఏపీ సీఎం చంద్రబాబుకు కవిత విజ్ఞప్తి చేశారు. అలాగే అశ్వరావుపేట పెద్దవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు వినతి చేశారు. ప్రసాద్ స్కీంలో భద్రాచలం రామాలయానికి రెండు వందల కోట్లు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి నిధులు



ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. కొత్తగూడెంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. కొత్తగూడెం బైపాస్ రోడ్డు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆదివాసులు, గిరిజనులకు రిజర్వేషన్లు ఉన్నాయని వారిని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. సింగరేణి నిర్వాసిత గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# బంగ్లాదేశ్‌లో మళ్లీ అల్లర్లు

**మీడియా సంస్థలు, షేక్ ముజిబుర్ ఇంటికి నిప్పు**



పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో మళ్లీ అల్లర్లు చెలరేగాయి. కొన్నాళ్ల క్రితం జరిగిన కాల్పుల్లో గాయపడిన బంగ్లాదేశ్‌కు చెందిన సాంస్కృతిక సంస్థ ఇంక్విలాబ్ మంచ్ ప్రతినిధి షరీఫ్ ఉస్మాన్ బిన్ హదీ సింగపూర్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి మృతితో బంగ్లాలో ఉద్రిక్తత తలెత్తింది. వేల సంఖ్యలో విద్యార్థులు రాజధాని ఢాకా సహా పలు ప్రాంతాల్లో నిరసనలకు దిగారు. భారత్, అవామీలీగ్ పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాజ్‌షాహిలోని అవామీ లీగ్ కార్యాలయాన్ని నిరసనకారులు ధ్వంసం చేశారు. బుల్డోజర్‌తో కూల్చివేశారు. బంగ్లాదేశ్‌లోని డెయిలీ స్టార్ పత్రికా కార్యాలయంపై కూడా దాడి చేశారు. ఢాకాలోని కర్వాన్ బజార్‌లో ఉన్న కార్యాలయానికి నిప్పుపెట్టారు. ఆ సమయంలో కార్యాలయంలో చిక్కుకుపోయిన దాదాపు 25 మంది జర్నలిస్ట్‌లను స్థానికులు కాపాడారు. బెంగాలీ పత్రిక ప్రోథోమ్ అలో కార్యాలయంపై కూడా అల్లరి మూకలు దాడులు చేశాయి. బంగ్లాదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ ముజిబుర్ రహమాన్ కుటుంబానికి ధన్‌మోండీ 32 ఏరియాలో ఉన్న ఇంటిని ఆందోళనకారులు ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. పలు ప్రభుత్వ కార్యాలయాలను కూడా నిరసనకారులు ధ్వంసం చేశారు.కాగా, హదీ విద్యార్థి ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. జులైలో అవామీలీగ్ నేత, ప్రధాని షేక్ హసీనాకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. దీంతో హదీ మరణాన్ని ఉద్యమంపై జరిగిన దాడిగా భావిస్తున్నారు. హదీ మరణంపై ప్రభుత్వ అధిపతి మహమ్మద్ యూనస్ మాట్లాడుతూ.. జులై ఉద్యమంలో ఒక నిర్భయ యోధుడని, ఆయన హత్య అత్యంత విచారకరమని అన్నారు. హంతకులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. హదీ భార్య, ఆయన బిడ్డ బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. శాంతిని, సంయమనాన్ని పాటించాలని ఆయన పౌరులకు విజ్ఞప్తి చేశారు.

# లోక్‌సభ నిరవధిక వాయిదా..

## ఆమోదం పొందిన కీలక బిల్లులు

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారం ముగిశాయి. లోక్‌సభ నిరవధిక వాయిదా పడింది. డిసెంబర్ 1వ తేదీన సమావేశాలు మొదలయ్యాయి. 19వ తేదీ వరకు కొనసాగాయి. మొత్తం 15 రోజుల పాటు సమావేశాలు జరిగాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు వాడీ వేడిగా సాగాయి. సమావేశాల సందర్భంగా లోక్‌సభ పలు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ' పేరుతో తీసుకువచ్చిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నిరసనల మధ్య ఈ బిల్లును ఆమోదించారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.అణు ఇంధన రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ఆహ్వానించేందుకు ఉద్దేశించిన శాంతి బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. సస్టైనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా(శాంతి) బిల్లును మూజువాణి ఓటుతో రాజ్యసభ ఆమోదించింది.బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 100 శాతానికి పెంచే బీమా సవరణ బిల్లు (సబ్ కా బీమా సబ్ కా రక్ష)ను ప్రతిపక్షాల నిరసనల మధ్యే లోక్‌సభ ఆమోదించింది. మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్(రెండవ సవరణ)బిల్లు 2025కి లోక్ సభ ఆమోదం తెలిపింది.



# కొల్లాపూర్ రేంజ్ అటవీ పరిధిలో పెద్దపులి జాడలు

**అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిక**

**కొల్లాపూర్ :** కొల్లాపూర్ రేంజ్ సోమశిల సెక్షన్ సరిహద్దు గ్రామాలలోని ఎంగంపల్లి తండా గ్రామ పరిధిలో పెద్దపులి సంచారం కలకలం రేపుతుంది. సమాచారం అందిన వెంటనే జిల్లా అటవీ శాఖ ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు.ఎంగంపల్లి తండా గ్రామ పరిసర ప్రాంతాలు, వ్యవసాయ పొలాలు, అటవీ సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు విస్తృతంగా పరిశీలనలు చేపట్టారు. ఈ పరిశీలన సమయంలో పొలాల్లో కనిపించిన పాదముద్రలు, ఇతర ఆనవాళ్లను



సాంకేతికంగా పరిశీలించిన అనంతరం అవి పెద్దపులికి చెందిన జాడలేనని అటవీ శాఖ అధికారులు కాశన్న, ముజీబ్ ఘోరి నిర్ధారించారు.ఎంగంపల్లి తండాతో పాటు అటవీ సరిహద్దు గ్రామ సర్పంచ్ గోపి నాయక్ ఆధ్వర్యంలో గ్రామాలలో ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని చాటింపు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో పొలాల వద్ద ఒంటరిగా వెళ్లవద్దని, చిన్న పిల్లలను అటవీ ప్రాంతం వైపు పంపవద్దని, గొర్లు, పశువులను కాపాడే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# బీజాపూర్‌లో ఎదురుకాల్పులు

**బీజాపూర్:** ఛత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్‌లో శుక్రవారం ఎన్‌కౌంటర్ జరిగింది. సెక్యూర్టీ సిబ్బంది, నక్సలైట్ల మధ్య శుక్రవారం ఉదయం ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. బైరాంఘర్-ఇంద్రావతి అడవి కొండల్లో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. నక్సలైట్ ఆపరేషన్ కోసం జిల్లా రిజర్వ్ గార్డు బృందం బయటకు వెళ్లిన సమయంలో ఎదురుకాల్పులు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. అటవీ ప్రాంతంలో మావోలు తిరుగుతున్నట్లు సమాచారం రావడంతో సెక్యూర్టీ బలగాలు అక్కడకు వెళ్లాయి. ప్రస్తుతం ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు ఓ పోలీసు అధికారి చెప్పారు. ఎన్‌కౌంటర్‌కు చెందిన మరిన్ని విషయాలు వెల్లడి కావాల్సి ఉన్నది.

# కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ సేవలు ఎనలేనివి

## విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళి



**జనోదయ, నంగునూర్, డిసెంబర్19:**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాల మాకుల గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆ ధ్వర్యంలో ముదిరాజ్ కుల వ్యవస్థాపకుడు, హైదరాబాద్ తొలి మేయర్ స్వర్గీయ కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ విగ్రహానికి పూలమా లవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా ముదిరాజ్ కులస్తులు మాట్లాడుతూ, కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ (ఆగస్టు 25, 1894 – డిసెంబర్ 19, 1967) స్వాతంత్ర్య సమరయోధుడు, హైదరాబాదు మాజీ మేయ ర్, రచయిత, పాత్రికేయుడు, విద్యావేత్తగా బహుముఖ ప్రజ్ఞాశీలిగా సేవలందించారని కొనియాడారు. ముదిరాజ్ సంఘాన్ని స్థాపిం చి, వ్యవస్థాపక అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వ హించిన గొప్ప నాయకుడని తెలిపారు. ఆ యన మహారాష్ట్రలోని జాల్నాలో ఒక పేద రైతు కుటుంబంలో జన్మించి, అపారమైన కష్టాలను అధిగమించి చదువుకున్నారు. చా దర్ ఘాట్ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేష న్ పూర్తి చేసి, నిజాం కళాశాలలో ఇంటర్మీడి యట్ చదివారు. అనంతరం బొంబాయిలో ముద్రణ, ప్రచురణా సాంకేతికతలో కోర్సు చే శారు. కొంతకాలం హైదరాబాద్ రాజ్య ప్రధా నమంత్రి మహారాజా కిషన్ పెర్షాద్ వద్ద అం తరంగిక కార్యదర్శిగా, ఆపై ఆడిటర్ జనరల్ కార్యాలయంలో పనిచేశారు. పాత్రికేయుడిగా డెక్కన్ స్టార్ (ఆంగ్లం), మసావత్ (ఉర్దూ) పత్రికలలో సంపాదకుడిగా పనిచేసిన ఆయ న, న్యూ ఎరా పత్రికకు సంపాదకత్వం వ హించారు. సియాసత్, రయ్యత్, రహనూ మా–ఏ–డెక్కన్, ఎమ్రోజ్ వంటి పత్రికలలో కాలమ్స్ రచించారు. 1925లో సొంత ముద్ర ణాలయం స్థాపించి, 1929లో 'పిక్టోరియల్ హైదరాబాద్' గ్రంథాన్ని వెలువరించగా, అది ప్రసిద్ధ రిఫరెన్స్ గ్రంథంగా నిలిచింది. హైద రాబాదు చరిత్ర, గోవా స్వాతంత్ర్య ఉద్యమం తదితర అంశాలపై అనేక గ్రంథాలు రచిం చారు. సామాజిక సేవలో భాగంగా 1918లో సోషల్ సర్వీస్ కాన్ఫరెన్స్ నిర్వహించగా, 1925లో జాంబాగ్ దేవాలయంలో హిందూ ధ ర్మ పరిషత్ మహాసభను స్థాపించారు. 1933 నుంచి 25 సంవత్సరాల పాటు హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చుడీబజార్ ప్రాం తానికి మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. 1940, 1955 సంవత్సరాలలో డిప్యూటీ మే యర్‌గా, 1957 – 58 కాలంలో హైదరా బాద్ నాలుగో మేయర్‌గా సేవలందించారు. మేయర్‌గా ఉన్న సమయంలో నగరానికి మా స్టర్‌ప్లాన్ రూపొందించి హైదరాబాదు అభివృ ద్ధికి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలమాకుల గ్రామ ముది రాజ్ కులస్తులు స్మరించుకున్నారు.

# నేడు వెల్ బేబి షో



**జనోదయ : మందమర్రి డిసెంబర్ 19 :**

సింగరేణి ఆవిర్భావ దినోత్స వాన్ని పురస్క రించుకుని ఈ నెల 20 న ఏరియా స్థాయి వెల్ బేబీ షో కార్యక్రమాన్ని కేకే డిస్పెన్సరీ లో నిర్వహిస్తున్నట్లు సింగరేణి ఏరియా డిజి ఎం పర్సనల్ గాజుల అశోక్ తెలిపారు. శు క్రవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ ఏరియాలోని సింగరేణి కార్మికుల 0 నుండి 5 సం,, లోపు పిల్లలు పోటీలో పాల్గొనేం దుకు అర్హులని తెలిపారు. పోటీలో పాల్గొనే వారు ఉదయం 10 గం,, లోపు పేర్లను డిస్పెన్సరీలో నమోదు చేసుకోవాలని సూచిం చారు. పేర్ల నమోదు, వయసు ధ్రువీకరణ, వాక్సిన్ కార్డు వెంట తీసుకురావాలని కోరారు.

## కోఆప్షన్ సభ్యులుగా దివ్యాంగులకు స్థానం కల్పించాలి

**-విహెచ్పిఎస్ జాతీయ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ -**



**జనోదయ, మందమర్రి డిసెంబర్ 19:**

గ్రామ పంచాయతీలలో త్వరలో ఎన్నుకోను న్న కోఆప్షన్ సభ్యులలో దివ్యాంగులకు స్థా నం కల్పించాలని వికలాంగుల హక్కుల పో రాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మ న్ పెద్దపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశా రు. మండలంలోని పులిమడుగు గ్రామంలో శుక్రవారం ఏర్పాటుచేసిన దివ్యాంగుల స మావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి గ్రామంలో వృద్ధులు వి తంతువులు, ఒంటరి మహిళలు, వికలాం గులు చేయూత పెన్షన్ దారులు ఉన్నారని, వారికి సేవలు అందించేందుకు, పంచాయతీ పాలనలో వికలాంగులను భాగస్వామ్యం చేసి పంచాయతీ కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్పిఎస్ మండల అ ధ్యక్షులు ఇందూరి రమేష్, నాయకులు బానో తు రాజు, బొడ్డుల బుచ్చిరాజం, ధరావత్ రాందాస్, దురిశెట్టి లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

# రామగుండంలో భారీగా బూడిద దందా?

- రోజుకు రూ.35 లక్షలు చేతులు మారుతున్నయ్..
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాళ్ల హరీష్ రెడ్డి ఆరోణ
- రామగుండం ఎమ్మెల్యేకు ఈ వ్యవహారంలో ప్రత్యక్ష సంబంధం ?
- పర్యావరణానికి హాని కలిగిస్తున్న ఎన్టీపీసీ అధికారులపై చర్యలు తీసుకోవాలి



**జనోదయ : గోదావరిఖని :**

రామగుండం ఎన్టీపీసీకి చెందిన భూ దందా లో ప్రతిరోజు రూ.35 లక్షల వరకు చేతులు మారుతున్నాయని, ఈ వ్యవహారంలో రామ గుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ కు ప్రత్యక్ష సంబంధం ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాళ్ల హరీష్ రెడ్డి ఆరోపిం చారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ యన మాట్లాడారు. రామగుండం ఎన్టీపీసీ లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా తయారవుతున్న బూడిద కుందనపెల్లి సమీపంలోని చెరువులో నిలువ చేస్తూ వాటిని అమ్మకాలు సాగించడం ద్వారా పెద్ద మొత్తంలో దందా నడుస్తుందని, ఈ దందా ద్వారా రోజుకు రూ.35 లక్షల వరకు అవినీతి జరుగుతుందని, ఈ వ్యవహా రంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్‌కు ప్రత్యక్ష సంబంధం ఉందని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. కుందన పల్లి బూడిద చెరువు వద్దకు ఎవరూ వెళ్లిన వారిని అడ్డుకోవడం అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న పోలీసులను అడ్డుపె ట్టుకొని లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం వస్తుందని కేసులు నమోదు చేయడం ఎమ్మెల్యే అను చరులుగా ఉన్నవారు ఈ దందాలో నేరుగా వ్యవహారం నడిపిస్తున్నారని పేర్కొన్నారు. రామగుండం ఎమ్మెల్యే తాను ఒక సత్యహరి చంద్రుడిగా పేర్కొంటూ నల్ల దందాలకు పాల్పడుతున్నాడని, దీనిని కప్పిపుచ్చుకునేం దుకు గోదావరిఖని పట్టణంలో రోడ్ల వెడల్పు పేరుతో కూల్చివేతలు చేస్తూ అభివృద్ధి జపం ఆలపిస్తున్నాడని స్పష్టం చేశారు. బూడిద దందా వ్యవహారంలో రామగుండం ఎన్టిపిసి అధికారులకు సంబంధం ఉందని, ఈ విష యంలో తాను ఢిల్లీ వెళ్లి ఫిర్యాదు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. పర్యా వరణానికి హాని కలిగించే విధంగా కుందన పల్లి చెరువులో బూడిద నింపుతూ మత్స్యకా రుల కడుపుకొట్టారని దళితులకు బూడిద టెండర్ ఇవ్వాలని, హైకోర్టు స్పష్టమైన ఆదే శాలు ఇచ్చిన వాటిని పాటించడం లేదని కోర్ట్ ఆఫ్ కంటెంట్ కింద వీరందరిపై చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు. రామగుండంలో నిర్మించ తలపెట్టిన 800 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు వల్ల ఈ నగరం మరింత కాలు ష్యరహితంగా మారే అవకాశం ఉందని, కేవ లం 100 మంది ఉద్యోగాల కోసం లక్షలాది మంది జీవితాలతో రామగుండం ఎమ్మెల్యే ఆడుకుంటున్నాడని ఆయన విమర్శించారు. రామగుండం ఎమ్మెల్యే పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగరేణి నిధులను దుబారా చేస్తూ కోట్లాది రూపాయ లను ఫుట్ బాల్ ఆటల పేరుతో దుర్వినియో గం చేస్తున్నాడని ఆరోపించారు. కోట్లాది రూపాయలను వృథా చేసే బదులు రైతులకు రైతుబంధు ఇవ్వడం ఇతర సంక్షేమ కార్యక్ర మాలు నిర్వహించడం చేయాలని ఆయన సూచించారు.




# సింగరేణి ఆవిర్భావ వేడుకలు కొనసాగించాలి

**ఏఐటియుసి నాయకులు డిమాండ్**

**మందమర్రి బ్రాంచి కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ,బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ భీమనాథని సుదర్శన్**

**జనోదయ, మందమర్రి డిసెంబర్ 19:**

ఈ నెల 23న నిర్వహించనున్న సింగరేణి ఆవిర్భావ వేడుకలు యధాతథంగా కొనసాగించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) బ్రాంచి కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ భీమనాథని సుదర్శన్‌లు సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. సింగరేణిలో ప్రతి సం,, డిసెంబర్ 23న సింగరేణి దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని వారు స్పష్టం చేశారు. ఆవిర్భావ వేడుకలను గత సం,, వరకు అన్ని ఏరియాలలో, కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో యాజమాన్యం వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగిందని వారు గుర్తు చేశారు. ఈ వేడుకలు ఉద్యోగుల మనోధైర్యాన్ని పెంపొందించడంలో, ఐక్యత, శ్రామిక శక్తిలో అనుబంధాన్ని పెంపొందించడంతో పాటు ఉద్యోగులు, సంస్థ మధ్య అనుబంధాన్ని బలోపేతం చేయడంలో ముఖ్య పాత్ర పోషించాయన్నారు. ఇటీవల సింగరేణి యాజమాన్యం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిలిపివేస్తున్నట్లు తమ సంఘం దృష్టికి వచ్చిందని దీంతో ఉద్యోగులు తీవ్ర నిరాశ, నిరుత్సాహానికి గురవుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి సం,, డిసెంబర్ 23న జరిగే సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పునరుద్ధరించి, గతంలో నిర్వహించినట్లుగా, అన్ని ఏరియాలలో, కంపెనీ స్థాయిలో కొనసాగించాలని కోరుతూ యాజమాన్యంకు గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లేఖ రాసినట్లు వారు తెలిపారు. యాజమాన్యం గతంలో వలే అన్ని ప్రాంతాల లలో సింగరేణి డే ఉత్సవాలు జరిపే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**జనోదయ, మందమర్రి డిసెంబర్ 19:**



మండలంలోని అందుగులపేట విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు నిర్వహిస్తున్నందున సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని జీఎం ఆఫీసు, యాపల్, కేకే 2, మందమర్రి (వి), టోల్ ప్లాజ, మార్కెట్, దీపక్ నగర్, పాలచెట్టు, దొరల బంగ్లా, రామకృష్ణ పూర్ (వి), కాళీ నగర్ క్యాంప్, పులిమడుగు, అందుగులపేట, కోటేశ్వరరావు పల్లి, బొక్కలగుట్ట, నార్లపూర్ లతో పాటు సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందనీ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

---

## కన్నీరు పెట్టినా

# కనికరం లేదా?

## ఆపరేషన్ చౌరస్తాతో ఉద్రిక్తత

**గోదావరిఖనిలో బుల్డోజర్ మంటలు**

**కొనసాగుతున్న కూల్చివేతలు**

**లబోదిబోమన్న బాధితులు**

**ప్రత్యామ్నాయం చూపకుండా కూల్చివేతలా?**

**మా కుటుంబాలు వీధిన పడవా?**

**నిరసన తెలిపిన వ్యాపారులు**

**రంగప్రవేశం చేసిన పోలీసులు**

**యథావిధిగా కూల్చివేతలు**

**జనోదయ, గోదావరిఖని, డిసెంబర్ 19:**



గోదావరిఖని గణేష్ చౌక్‌లో ఆపరేషన్ చౌరస్తా ఉద్రిక్తతకు దారి తీసింది. కూల్చివేతలు ఆపాలంటూ బాధితులు లబోదిబోమంటూ జేసీబీకి అడ్డంగా బైఠాయించడం ఆందోళనగా మారింది. అధికారులు, వ్యాపారుల మధ్య వాగ్వాదం తీవ్ర స్థాయిలో జరిగింది. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని టాక్సీ స్టాండ్ ప్రక్కన గల ప్రభుత్వ స్థలంలో చాలా కాలంగా ఉన్న దుకాణాలు అక్రమ నిర్మాణాల నెపంతో రామగుండం నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం ఉదయం తొలగించేందుకు రంగంలోకి దిగారు. ఎక్స్కవేటర్‌తో నిర్మాణాలను కూల్చివేసేందుకు ఉపక్రమించగా వ్యాపారులు అడ్డుకున్నారు. ఇప్పటికప్పుడు కూల్చివేస్తే తమ జీవనోపాధి ఎట్ల అంటూ వాపోయారు. కాగా ఇది ప్రభుత్వ స్థలమని, ఇందులో నిర్మించుకున్న దుకాణాలు తొలగించుకోవాలని గతంలోనే నోటీసులు జారీ చేశామనీ, ఖాళీ చేయని కారణంగా తామే తొలగించాల్సి వస్తుందని టౌన్ ప్లానింగ్ అధికారులు స్పష్టం చేశారు. తమకు ప్రత్యామ్నాయం చూపకుండా ఉన్నపలంగా కూల్చివేస్తే రేపటి నుంచి తమ కుటుంబాలు వీధిన పడుతాయని బాధితులు ఆందోళన చేపట్టారు.జేసీబీ ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. తమ పొట్ట కొట్టవద్దంటూ కన్నీరు పెట్టుకున్నారు. అధికారులను కాళ్లావేళ్లా పడి బతిమిలాడుకున్నారు. పలువురు రాజకీయ పార్టీల నాయకులు సంఘటన స్థలంకు చేరుకొని బాధితులకు మద్దతుగా నిలిచి కూల్చివేతలను ఆపాలని అధికారులను డిమాండ్ చేశారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. కూల్చివేత చర్యలతో చౌరస్తాలో ఆందోళనకర వాతావరణం నెలకొంది. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చట్టరీత్యా నేరమనీ, ఎప్పటికైనా ఖాళీ చేయాల్సిందేనని మున్సిపల్ అధికారులు సముదాయించడంతో బాధితులు షాపుల్లోని సామగ్రిని బయటకు తీసుకవచ్చి ఖాళీ చేశారు. అనంతరం పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు యథావిధిగా కొనసాగాయి.

## సిద్దిపేట మండల నూతన ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికలు



**జనోదయ, సిద్దిపేట, డిసెంబర్19:**

సిద్దిపేట జిల్లా సిద్దిపేట మండల నూతన ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా తాటికొండ శ్రీనివాస్ రెడ్డి (ఎస్ ఆర్ ఐ స్టూడియో), ప్రధాన కార్యదర్శిగా గొనె రాజు, ఖజానాదారుగా మాత సతీష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న మండలంలోని ఫోటోగ్రాఫర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామని, అలాగే ఫోటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని వారు హామీ ఇచ్చారు.




# పొట్టిపోరులో భారత్ జయభేరి



## పాండ్యా బ్యాటుతో, వరుణ్ బంతితో.. 3-1తో సిరీస్ గెలుపొందిన టీమిండియా

**అహ్మదాబాద్ :** నిరుడు టీ20 ప్రపంచ కప్ నుంచి భారత జట్టు అన్‌స్టాపబుల్‌గా దూసుకెళ్తోంది. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో సిరీస్ పట్టేసిన టీమిండియా ఈసారి 30 పరుగులతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. శుక్రవారం అహ్మదాబాద్‌లో హార్దిక్ పాండ్యా(63), తిలక్ వర్మ(73)లు మెరుపు హాఫ్ సెంచరీలతో భారీ స్కోర్ అందించగా.. బంతితో వరుణ్ చక్రవర్తి(4-53), బుమ్రా(2-17)లు రెచ్చిపోయారు. అంతే.. ఒత్తిడికి లోనైన సఫారీ టీమ్ ఓటమిపాలైంది. టెస్ట్ సిరీస్ కోల్పోయినా వన్డే, పొట్టి ట్రోఫీలు హస్తగతం చేసుకున్నది..పొట్టి సిరీస్‌లో ప్రత్యర్థి ఎవరైనా విజయం మాదే అన్నట్టుగా భారత్ జోరు కొనసాగుతోంది. ఇప్పటికే వరుసగా 6 ట్రోఫీలు గెలుచుకున్న టీమిండియా స్వదేశంలో దక్షిణాఫ్రికాను ఓడించి సిరీస్ పట్టేసింది. టీమిండియా నిర్దేశించిన 232 పరుగుల భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించింది. ఓపెనర్ క్వింటన్ డికాక్(65) సిక్సర్లు, ఫోర్లతో హోరెత్తించాడు. దాంతో.. స్కోర్ బోర్డు పరుగులు తీసింది. డికాక్ విధ్వంసంతో పవర్ ప్లేలో వికెట్ కోల్పోకుండా 67 రన్స్ చేసింది. తర్వాత బంతి అందుకున్న వరుణ్ చక్రవర్తి మొదటి ఓవర్లోనే రీజా హెండ్రిక్స్(13)ను ఔట్ చేసి బ్రేకిచ్చాడు.డెవాల్డ్ బ్రెవిస్(31) జతగా దంచేస్తున్న డికాక్‌ను బుమ్రా రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. 13వ ఓవర్లో చక్రవర్తి వరుస బంతుల్లో ఎడెన్ మర్క్‌రమ్(6)ను ఎల్బీగా.. డొనొవాన్ ఫెరీరా(0)ను బౌల్డ్ చేసి మ్యాచ్‌ను టీమిండియావైపు తిప్పాడు. ఆ తర్వాత పాండ్యా ఓవర్లో 6, 4 బాదిన డేవిడ్ మిల్లర్(18)ను అర్ష్‌దీప్ బోల్తా కొట్టించాడు. చివరి ఓవర్లో లిండే(16)ను ఔట్ చేసి సఫారీలను ఒత్తిడిలో పడేశాడు. కానీ, మార్కో యాన్సన్(14) వరుసగా రెండు సిక్సర్లతో స్కోర్ 170 దాటింది. బుమ్రా ఓవర్లో రివ్యూతో యాన్సెన్ వెనుదిరగగా పర్యాటక జట్టు ఓటమి ఖాయమైంది.పాండ్యా, తిలక్ సునామీ ఇన్నింగ్స్ టీ20 వరల్డ్‌కప్ సన్నాహక సిరీస్‌తో పునరాగమనం చేసిన హార్దిక్ పాండ్యా(63: 25 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లు) అహ్మదాబాద్‌లో చితక్కొట్టాడు. తన పవర్ హిట్టింగ్‌తో దక్షిణాఫ్రికా బౌలర్లను బెంబేలెత్తించిన పాండ్యా జట్టుకు భారీ స్కోర్ అందించాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్లు సంజూ శాంసన్(37), అభిషేక్ శర్మ(34)లు శుభారంభమివ్వగా.. కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్(5) ఎప్పటిలానే విఫలమయ్యాడు. సూర్య ఔటయ్యే సరికి స్కోర్ 115-3. ఆ దశలో క్రీజులోకి వచ్చిన పాండ్యా ఆలస్యం చేయకుండా ఉతుకుడే పనిగా పెట్టుకున్నాడు. లిండే, కార్బిన్ బాష్ ఓవర్లలో బౌండరీలతో రెచ్చిపోయిన అందుకున్నాడు. ఆ తర్వాత కూడా తనదైన విధ్వంసక ఆటతో స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. పాండ్యాకు జతగా తిలక్ వర్మ(73: 42 బంతుల్లో 10 ఫోర్లు, సిక్సర్) స్వీప్ షాట్లతో హోరెత్తించి అర్ధ శతకం బాదాడు. వీరిద్దరూ పోటీ పడుతూ బౌండరీలు బాదేయగా సఫారీ బౌలర్లు నీరుగారిపోయారు. పాండ్యా, తిలక్ మెరుపులతలో 17 ఓవర్లకే స్కోర్ 200 దాటింది. చివరి మూడు ఓవర్లలో 31 రన్స్ రాగా.. సఫారీలకు 232 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది .

# ఉద్యోగుల ఎంపికలో నిజాయతీకి ప్రాధాన్యమివ్వాలి




### చిత్తశుద్ధి విషయాల్లో అస్సలు రాజీపడొద్దు : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**హైదరాబాద్, డిసెంబర్ 19 :**

ఉద్యోగుల ఎంపికలో నిజాయతీ, సచ్ఛీలతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. నైపుణ్యాలు లేకుంటే శిక్షణ ద్వారా అధిగమించొచ్చని.. కానీ సచ్ఛీలత లోపిస్తే భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించలేమని తెలిపారు. హైదరాబాద్‌లో జాతీయ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ల కాన్ఫరెన్స్‌ను శుక్రవారం రాష్ట్రపతి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నిజాయతీ, చిత్తశుద్ధి విషయాల్లో కమిషన్లు అస్సలు రాజీపడొద్దని సూచించారు. నిజాయతీ, సమగ్రత చాలా ముఖ్యమైనవి. అభ్యర్థుల నైతిక ధోరణిని అర్థం చేసుకునేందుకు సహాయపడే సాధనాలను పబ్లిక్ సర్వీస్ కమిషన్లు అన్వేషించాలి' అని ఉద్బోధించారు. సాంకేతిక సవాళ్లను అధిగమించడం, పారదర్శకత, విశ్వసనీయ తను పెంచేందుకు కమిషన్లు పాటుపడాలని దిశా నిర్దేశం చేశారు. అవకాశాల్లో, సమానత్వ ఆదర్శాన్ని అనుసరించడమే కాకుండా ఫలితాల్లోనూ సమానత్వ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని చెప్పారు. లింగ సమానత్వాన్ని సర్వీస్ కమిషన్లు అధిక ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువతలో అణగారిన, బలహీనవర్గాల కోసం పని చేయాలన్న ఆసక్తి ఉండాలని చెప్పారు. మహిళల అవసరాలు, ఆకాంక్షల పట్ల ఉద్యోగులు సునిశితంగా వ్యవహరించాలని నిర్దేశించారు. కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, యూపీఎస్సీ చైర్మన్ అజయ్‌కుమార్, టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం, మంత్రి సీతక్క తదితరులు పాల్గొన్నారు. జాతీయ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ల రెండు రోజుల సదస్సు నేడు (శనివారం) కొనసాగనుంది.

# లొంగిపోయిన 41 మంది మావోయిస్టులు



**హైదరాబాద్:** నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో 41 మంది మావోయిస్టు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో వివిధ డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు కూడా ఉన్నారు. మొత్తం 24 ఆయుధాలు, 733 తూటాలు, 8 బీజీఎల్ షెల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో ఇద్దరు తెలంగాణ వాళ్లు ఉండటం గమనార్హం. పోలీసుల వివరాల ప్రకారం.. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్/కంపెనీ స్థాయి కమిటీ సభ్యులు, 12 మంది ఏరియా/ప్లాటూన్ కమిటీ సభ్యులు, 23 మంది సాధారణ పార్టీ సభ్యులు ఉన్నారు. ఇన్సాస్ ఎల్‌ఎంజీ, ఏకే - 47, ఎస్‌-ఎల్‌ఆర్, ఇన్సాస్ రైఫిళ్లు, .303 రైఫిళ్లు తదితర ఆయుధాలు లొంగుబాటులో భాగంగా అప్పగించారు. మావోయిస్టు పార్టీలో సంస్థాగత బలహీనత, నాయకత్వంపై నమ్మకం తగ్గడం, అడవుల్లో తీవ్ర జీవన కష్టాలు, భద్రతా బలగాల ఒత్తిడి కారణంగానే తాము ప్రధాన జనజీవనంలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు లొంగిపోయిన మావోయిస్టులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుకు స్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి రాష్ట్ర పునరావాస విధానం ప్రకారం డివిజనల్ కమిటీ సభ్యులకు రూ.5 లక్షలు, ఏరియా కమిటీ సభ్యులకు రూ.4 లక్షలు, పార్టీ సభ్యులకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించనున్నారు. ఆయుధాలపై అదనపు రివార్డు కూడా ఇవ్వనున్నారు. మొత్తంగా రూ.1.46 కోట్లకు పైగా నగదు ప్రోత్సాహకాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ లొంగుబాటుతో తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాలు మరింత బలహీనపడతాయని, మిగిలిన అజ్ఞాత కేడర్లు కూడా హింసను వీడి జనజీవనంలోకి రావాలని పోలీసులు పిలుపునిచ్చారు.

జనోదయ



## రామగుండంలో..

# బూడిద దందా?

## ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌పై బీఆర్ఎస్ నేతల విమర్శలు

- రోజు రూ.35 లక్షలు చేతులు మారుతున్నాయని బీఆర్ఎస్ నేత వ్యాళ్ల ఆరోపణలు
- ఓ పక్క కూల్చివేతలు.. మరోపక్క అవినీతి ఆరోపణలు
- వెనక్కి తగ్గని ఎమ్మెల్యే
- కొనసాగుతున్న కూల్చివేతలు
- చాపకింద నీరులా ఎమ్మెల్యే వ్యతిరేక ప్రచారం







ఎమ్మెల్యే వర్సెస్ వ్యాళ్ల




**పెద్దపల్లి** జిల్లా రామగుండంలో పెద్ద ఎత్తున బూడిద దందా జోరుగా కొనసాగుతోందని చాలా రోజులుగా పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్న విషయం తెల్సిందే. ఈ వ్యవహారంలో స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌పై బీఆర్ఎస్ నేత వ్యాళ్ల హరీష్‌రెడ్డి ఆరోపణలు చేస్తుండటం కలకలం రేపుతోంది.శుక్రవారం గోదావరి ఖనిలో విలేకరుల సమావేశంలో హరీష్ రెడ్డి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌పై తీవ్ర విమర్శలు చేయడం చర్చనీయాంశంగా మారింది.రామగుండం ఎన్‌టీపీసీకి చెందిన భూ దందాలో ప్రతిరోజు రూ.35 లక్షల వరకు చేతులు మారుతున్నాయని, ఈ వ్యవహారంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్‌కు ప్రత్యక్ష సంబంధం ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాళ్ల హరీష్ రెడ్డి ఆరోపించారు.రామగుండం ఎన్‌టీపీసీలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా తయారవుతున్న బూడిద కుందనపెల్లి సమీపంలోని చెరువులో నిలువ చేస్తూ వాటిని అమ్మకాలు సాగించడం ద్వారా పెద్ద మొత్తంలో దందా నడుస్తుందని, ఈ దందా ద్వారా రోజుకు రూ.35 లక్షల వరకు అవినీతి జరుగుతుందని తీవ్రస్థాయిలో ఆరోపించారు. కుందనపల్లి బూడిద చెరువు వద్దకు ఎవరూ వెళ్లిన వారిని అడ్డుకోవడం అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న పోలీసులను అడ్డుపెట్టుకొని లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం వస్తుందని కేసులు నమోదు చేయడం ఎమ్మెల్యే అనుచరులుగా ఉన్నవారు ఈ దందాలో నేరుగా వ్యవహారం నడిపిస్తున్నారని పేర్కొన్నారు. రామగుండం ఎమ్మెల్యే తాను ఒక సత్యహరి చంద్రుడిగా పేర్కొంటూ నల్ల దందాలకు పాల్పడుతున్నాడని, దీనిని కప్పిపుచ్చుకునేందుకు గోదావరి ఖని పట్టణంలో రోడ్ల వెడల్పు పేరుతో కూల్చివేతలు చేస్తూ అభివృద్ధి జపం ఆలపిస్తున్నాడని స్పష్టం చేశారు. బూడిద దందా వ్యవహారంలో రామగుండం ఎన్టిపిసి అధికారులకు సంబంధం ఉందని, ఈ విషయంలో తాను ఢిల్లీ వెళ్లి ఫిర్యాదు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు..మరోవైపు గోదావరి ఖనిలో శుక్రవారం ఆపరేషన్ చౌరస్తా పేరిట కూల్చివేతలు కొనసాగాయి.అర్ధంతరంగా తమ వ్యాపార సముదాయాలను కూల్చివేస్తే తాము రోడ్డున పడుతామని బాధితులు కన్నీళ్లు పెట్టుకున్నారు.వ్యాపార సముదాయాలను కూల్చివేస్తున్న బుల్డోజర్‌కు అడ్డుపడి నిరసన తెలిపారు.పోలీసుల రంగ ప్రవేశంతో కూల్చివేతలు కొనసాగాయి.మొత్తం మీద ఓ వైపు బూడిద దందా ఆరోపణలు..మరోవైపు కూల్చివేతలతో రామగుండం రాజకీయంగా వేడెక్కింది.స్థానిక ఎమ్మెల్యేపై బీఆర్ఎస్ నేతలు విమర్శల దాడిని పెంచారు.వాస్తవానికి రామగుండంలో బూడిద దందా పెద్ద ఎత్తున జరుగుతోందంటూ ఆరోపణలు చాలా రోజులుగా విన్పిస్తున్నాయి.ఈ ఆరోపణల్లో నిజం లేకపోలేదు. కొందరు ముఠాగా ఏర్పడి బూడిద దందా చేస్తూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారనే విమర్శలు వచ్చాయి.ఈ దందా వెలుగులోకి రాకుండా మీడియాకు కూడా భారీ స్థాయిలో మామూళ్లు ఇచ్చి దందాను వెలుగులోకి రాకుండా చేసిన విషయం తెల్సిందే.కొందరు మీడియా ప్రతినిధులు బూడిద దందా విషయం వెలుగులోకి రాకుండా చేయడానికి డబ్బులు తీసుకుని వాటాల పంపకంలో తేడాలు రావడంతో ఓ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధిపై దాడి చేసినట్లుగా ప్రచారం జరిగింది.ఈ విషయంపై వాస్తవం పత్రికలో ఎవరి పేరు పెట్టకుండా జరిగిన విషయాన్ని ప్రచురిస్తే ఈ విషయంపై ఆ పత్రిక ప్రధాన సంపాదకులు మానసాని కృష్ణారెడ్డితోపాటు మరి కొందరిపై ఓ పోలీసు అధికారి అక్రమ కేసు బనాయించిన విషయం తెల్సిందే. అయితే ఇప్పుడు ఈ వ్యవహారంలో ఏకంగా రామగుండం ఎమ్మెల్యేపైనే బీఆర్ఎస్ నేత వ్యాళ్ల హరీష్ రెడ్డి ఆరోపణలు చేయడంతో ఈ వ్యవహారం మరింత ముదిరినట్లయింది.అయితే బూడిద దందాతో పాటు రామగుండంలో అభివృద్ధి పేరుతో పాటు రోడ్ల విస్తరణ చేయడానికి కొద్దిరోజులుగా కూల్చివేతలు కొనసాగుతున్నాయి.పట్టణాన్ని సుందరీకరణ చేయడానికి మా బతుకులు రోడ్డున పడేస్తారా? అంటూ వివిధ వ్యాపారులు తీవ్రంగా నిరసన చేపడుతున్న విషయం తెల్సిందే. అయితే ఎవరెన్ని నిరసనలు చేసినా..ఆరోపణలు చేసినా స్థానిక ఎమ్మెల్యే మాత్రం వెనక్కి తగ్గడం లేదు.కూల్చివేతలను కొనసాగిస్తూ పట్టణంలో రోడ్లవెడల్పు చేసే కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు.అయితే గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో కూడా అప్పటి స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మీద ఆర్ఎఫ్‌సీఎల్ కొలువుల దందా ఆరోపణలు తీవ్రస్థాయిలో వచ్చాయి.రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉద్యోగాలు ఇప్పిసామని నిరుద్యోగుల నుంచి ఉద్యోగాల పేరిట బీఆర్ఎస్ నేతలు లక్షలాది రూపాయలు వసూళ్లు చేసినట్లుగా తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి.అనంతరం లక్షలాది రూపాయలు అప్పులు చేసి కొలువులు సాధించిన నిరుద్యోగుల ఉద్యోగాలు తాత్కాలికమేనని తేలడంతో కొందరు ఎటూపాలుపోక బలవన్మరణాలకు పాల్పడిన విషయం తెల్సిందే. ఈ వ్యవహారంలో అప్పటి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అనుచరుల మీద ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన కట్టడి చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆయన ఓటమికి ఇదే ప్రధాన కారణంగా మారింది. జరిగిన తప్పును వెంటనే సరిచేసుకోకుండా ప్రశ్నించిన వారిపై నాడు కూడా పోలీసులు అక్రమ కేసులతో ఇబ్బందిపెట్టారు. ఇప్పుడు కూడా బూడిద వ్యవహారంలో స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్‌పై తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. వచ్చిన ఆరోపణలకు సరియైన సమాధానం ఇవ్వకుండా ప్రశ్నించిన వారిపై కేసులతో ఇరుకున పెడదామనే పోలీసుల అత్యుత్సాహం ఈ ఎమ్మెల్యేని కూడా ఇంటిదారి పట్టిస్తుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.ఏదిఏమైనప్పటికీ అటు కూల్చివేతలు..ఇటు బూడిద దందా ఆరోపణలు రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌ని చుట్టుముట్టాయి.ఈ వ్యవహారంలో వెంటనే నష్టనివారణ చర్యలకు అధిష్టానం ఉపక్రమించకపోతే పార్టీకి,ప్రభుత్వానికి తీరని డ్యామేజ్ ఏర్పడుతుందని పార్టీ నేతలే అంటున్నారు.గతంలో కూడా ఆరోపణలు వచ్చిన వెంటనే నాటి బీఆర్ఎస్ అధిష్టానం చర్యలకు ఉపక్రమించి ఉంటే గడిచిన ఎన్నికల్లో సింగరేణి బొగ్గుగనుల్లో కారు గల్లంతు అయ్యి ఉండేది కాదు. అలా కాకుండా ఎన్ని ఆరోపణలు వస్తే అంత గొప్ప అనుకుని నాటి మంత్రి కేటీఆర్ ఇక్కడి స్థానిక ప్రజాప్రతినిధులను వెనకేసుకుని రావడం మొత్తం బీఆర్ఎస్ వ్యవస్థే కుప్పకూలేలా చేసింది.నాటి పరిస్థితులే నేడు పునరావృతం అన్నట్లుగా ఉంది.ఇప్పుడు కూడా ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అధిష్టానం నజర్ వేయకపోతే మిగిలేది శూన్య హస్తమే.ఇందులో ఎలాంటి అనుమానం లేదని గత చరిత్రలు చెబుతున్నాయి. అభివృద్ధి అంటే కూల్చివేతలే కాదు..బాధితులకు తక్షణ పునరావాసం చూపించాలి. కూల్చివేయడం తేలిక.. నిర్మించడమే కష్టం.మరి ఈ విషయాన్ని మరచి అదిగో అద్భుతం...అల్లదిగో అభివృద్ధి అని ఆకాశంలో రంగుల ప్రపంచాన్ని చూపిస్తే వచ్చే ప్రయోజనం ఉండదు. నిరసనలు,వ్యతిరేక ప్రచారాలు రోజురోజుకి పెరుగుతూనే ఉంటాయి.ఇప్పుడు రామగుండంలో కూడా అదే జరుగుతోంది.చాపకింద నీరులా ఎమ్మెల్యే వ్యతిరేక ప్రచారం జోరందుకుంది. వచ్చిన ఆరోపణల్లో నిజానిజాల సంగతి ఎట్లున్నా కావాల్సినంత డ్యామేజ్ జరుగుతోంది. చేసేది తక్కువ..ప్రచారం ఎక్కువ మీదనే దృష్టి అన్నట్లుగా ఇక్కడి రాజకీయ నాయకుల వ్యవహారం ఉంటుంది.వాస్తవిక పరిస్థితులను అర్థం చేసుకోకుండా కేవలం సామాజిక మాధ్యమాల్లో స్వంత డప్పుకొట్టుకుంటూ ఇక్కడి రాజకీయ నేతలు రాజకీయాలు చేయడం విడ్డూరం.అన్ని పార్టీల నేతల తీరు ఇలానే ఉంది... ఉదయం లేచిన దగ్గరి నుంచి అన్న సూపర్..హీరో..చూడండి మా నేత అంటూ స్వంత సామాజిక మాధ్యమాల్లో అనుచరులు, భజనపరులు చేసే భజనలతో మురిసిపోతూ ప్రజల ఆలోచనల్లో ఏముంది? వారు ఏమనుకుంటున్నారు? అనే విషయాలను మరవడం ఇక్కడి నేతలకు అలవాటుగా మారింది. ఇలాంటి మితిమీరిన స్వంత డప్పు ప్రచారాలాతో జనం ఓట్లు గుమ్మరిస్తారనే ఆపోహల్లో నుంచి నేతలు బయటకు రావాల్సిన అవసరం ఉంది. మరి రామగుండలో ఈ పరిస్థితిని చక్కదిద్దుకుంటారా? అహంభావంతో వ్యవహరిస్తారా? అనే దానిపైనే రామగుండం రాజకీయం మలుపుతిరగబోతోంది.

**బూడిద వ్యవహారంలో స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్‌పై తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. వచ్చిన ఆరోపణలకు సరియైన సమాధానం ఇవ్వకుండా ప్రశ్నించిన వారిపై కేసులతో ఇరుకున పెడదామనే పోలీసుల అత్యుత్సాహం ఈ ఎమ్మెల్యేని కూడా ఇంటిదారి పట్టిస్తుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.**

....................

**మానసాని కృష్ణారెడ్డి**
**9618616110**
**8074124190**

## ప్రపంచ ధ్యాన దినోత్సవం లో ప్రతి ఒక్కరు పాల్గొనాలి

**జనోదయ మందమర్రి డిసెంబర్ 19:** ఈనెల 21న రాత్రి 8 గంటలకు నిర్వహించనున్న ప్రపంచ ధ్యాన దినోత్సవ వేడుకల్లో పట్టణానికి చెందిన ప్రతి ఒక్కరూ పాల్గొని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ధ్యాన కేంద్రం డిస్టిక్ కోఆర్డినేటర్ ప్రవీణ, సెంటర్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్, అభ్యాసకులు శ్రీనివాస్ రెడ్డి, సోమశేఖర్, సదానందం లు కోరారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది గైడెడ్ ధ్యాన కార్యక్రమం వాల్ పోస్టర్లను మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్గత శాంతి, ప్రపంచ సామరస్యాన్ని పెంపొందించడానికి ధ్యానం చారిత్రాత్మక ప్రపంచ కార్యక్రమం అని ప్రతి ఒక్కరు ధ్యాన మార్గాన్ని ఆచరించా లని కోరారు.ధ్యాన కార్యక్రమం లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు http://hfn.link/meditation రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మరిన్ని వివరాలకు http://hfn.link/whatsapp గ్రూప్ లో చేరాలని సూచించారు.



## డిజిఎం(జియాలజిస్టు)ను కలిసిన ఏఐటియుసి నాయకులు

**జనోదయ, గోదావరిఖని, డిసెంబర్ 19:** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని ఎక్స్ ప్లోరేషన్ డిపార్ట్మెంట్ కు నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన డిజిఎం జియాలజిస్టు రమేశ్ ను గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు శుక్రవారం పూల బోకే అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ఎక్స్ప్లోరేషన్ డిపార్ట్మెంట్ లో పని చేస్తున్న ఏఐటియుసి డిపార్ట్మెంట్ కమిటీ సభ్యులను జియాలజిస్టు రమేశ్ కు పరిచయం చేస్తూ, కార్మికుల కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు సంకె అశోక్, సహాయ కార్యదర్శి రంగు శ్రీను, నాయకులు ఎం ఎ గౌస్, సయ్యద్ సోహేల్, పొన్నాల వెంకటయ్య, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, డిపార్ట్మెంట్ కార్యదర్శి ఎం సత్యనారాయణ, వెంకటేష్, ఎర్రగొల్ల చేరాలు పాల్గొన్నారు.



## మూడో విడత స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులతో సమావేశం

**జనోదయ, చెన్నూర్,డిసెంబర్ 19:** మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో ఇటీవలే జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులతో సమావేశం నిర్వహించిన కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి. చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నుకోబడ్డ సర్పంచ్ లకు సత్కార కార్యక్రమం నిర్వహించిన కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి.గెలిచిన సర్పంచ్, ఉప సర్పంచ్ సభ్యులకు శాలువా కప్పి సత్కారం చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి.సన్మాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న నూతనంగా ఎన్నుకొన్న సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు



## ఎంఎస్పి ఖని పట్టణ కన్వీనర్ గా సదానందం మాదిగ

**జనోదయ, గోదావరిఖని, డిసెంబర్ 19:** మహాజన సోషలిస్టు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఎస్పి గోదావరిఖని పట్టణ కన్వీనర్ గా స్థానిక విద్యనగర్ కు చెందిన కాసిపేట సదానందం మాదిగను నియమితులయ్యారు. పార్టీలో చురుకుగా వ్యవహరిస్తున్నందుకు ఇట్టి నియామకం చేయడం జరిగిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇకపై పార్టీ నియమ నిబంధనలు అనుసరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆదేశించారు. కాగా తన నియామకానికి సహకరించిన పెద్దపెల్లి జిల్లా ఇంచార్జ్ ఏపూరి వెంకటేశ్వర్ రావు మాదిగ, నాయకులు ఏక్ శంకర్ మాదిగ, పల్లె బాపు మాదిగ, మడిపల్లి దశరథం మాదిగ, కాసిపేట రాజయ్య మాదిగ, గద్దల అనిల్ కుమార్ మాదిగ లకు సదానందం కృతజ్ఞతలు తెలిపారు.



# పల్లెల రూపు మారేనా?

**★నూతన సర్పంచుల ముందున్న పరీక్ష!**

**జనోదయ, జగిత్యాల ప్రతినిధి, డిసెంబర్ 19:** తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. కొత్త సర్పంచులు బాధ్యతలు స్వీకరిస్తున్నారు. ప్రతి ఎన్నికల అనంతరం వినిపించే ఆశాభావాలే ఈసారి కూడా గ్రామాల్లో మార్మోగుతున్నాయి. *"ఈసారి మార్పు రావాలి... అభివృద్ధి కనిపించాలి"* అనే ప్రజల ఆకాంక్షలు కొత్తగా ఎన్నికైన గ్రామ నాయకుల ముందున్న అసలైన పరీక్షగా నిలుస్తున్నాయి.



గ్రామ పాలన అంటే కేవలం ఒక పదవి కాదు. అది ప్రజల నిత్యజీవితానికి నేరుగా సంబంధించిన బాధ్యత. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి మౌలిక అంశాలు గ్రామాల్లో ఇప్పటికీ ప్రధాన సమస్యలుగానే ఉన్నాయి. ఇవి రాజకీయ నినాదాలుగా కాకుండా, పాలనలో ప్రాధాన్యతగా మారాల్సిన అంశాలు. గత అనుభవాలను పరిశీలిస్తే—కొంతమంది సర్పంచులు అధికారం, హోదా అనే కోణంలోనే పదవిని చూసి, ప్రజలతో దూరమయ్యారనే విమర్శలు లేకపోలేదు. ఆ లోపాలే పల్లెల అభివృద్ధికి అడ్డంకులుగా మారాయి.

ఈసారి ఎన్నికల ఫలితాలు మాత్రం కొంత భిన్నమైన సంకేతాలు ఇస్తున్నాయి. యువత, మహిళలు, చదువుకున్న అభ్యర్థులు పెద్ద సంఖ్యలో గ్రామ పాలనలోకి రావడం ప్రజల్లో ఆశను పెంచుతోంది. సమస్యలను అనుభవించిన వారే పాలకులుగా మారడం సహజంగానే సానుకూల మార్పుకు అవకాశమిస్తుంది. అయితే ఆశలతో పాటు అనుభవ లోపం కూడా ఒక సవాలేనన్న విషయాన్ని విస్మరించలేం.

నూతన సర్పంచుల ముందున్న అవకాశాలు అపారమైనవే. ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయడం, నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించడం, అధికారులతో సమన్వయం సాధించడం ద్వారా గ్రామాల ముఖచిత్రాన్ని మార్చే శక్తి వారికి ఉంది. అదే సమయంలో నిధుల కొరత, రాజకీయ ఒత్తిళ్లు, అధికార వ్యవస్థలోని జాప్యాలు వంటి అడ్డంకులు కూడా ఎదురవుతాయి. ఈ పరిస్థితుల్లో సమతుల్యతతో నిర్ణయాలు తీసుకోవడమే నిజమైన నాయకత్వ లక్షణం.

ఇప్పటి కాలంలో గ్రామ పాలన సాంకేతికతకు దూరంగా ఉండలేరు. డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ పర్యవేక్షణ, పంచాయతీ ఖాతాల పారదర్శకత—ఇవి అమలులోకి వస్తేనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. 'స్మార్ట్ గ్రామం' అనే మాట నినాదంగా కాకుండా ఆచరణలోకి రావాల్సిన అవసరం ఉంది. కొత్త సర్పంచులు ఈ దిశగా అడుగులు వేస్తే గ్రామాభివృద్ధికి కొత్త దారి తెరుచుకుంటుంది.

అయితే, మార్పు బాధ్యత మొత్తం సర్పంచుల మీదే వేయడం సమంజసం కాదు. గ్రామాభివృద్ధిలో ప్రజల పాత్ర కూడా అంతే కీలకం. గ్రామ సభల్లో పాల్గొనడం, ప్రశ్నలు వేయడం, పనుల అమలును పర్యవేక్షించడం ప్రజల హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా. ప్రజల భాగస్వామ్యం లేకుండా గ్రామ పాలన బలపడదు.

ఈ సందర్భంలో పాత్రికేయుల పాత్రను కూడా ప్రస్తావించాల్సిందే. గ్రామ పాలనలో లోపాలను ప్రశ్నించడం మీడియా బాధ్యత. కానీ, సంచలనం కోసం వాస్తవాలను వక్రీకరించడం, వ్యక్తిగత ఆరోపణలకు దిగడం జర్నలిజం కాదు. ప్రజా ప్రయోజనమే కేంద్రంగా, నిజాలను ఆధారంగా చేసుకుని ప్రశ్నించడమే పాత్రికేయ ధర్మం. మంచి పనులను గుర్తించడం కూడా అంతే అవసరం.

మొత్తానికి, నూతన సర్పంచులతో పల్లెల రూపు మారే అవకాశం ఉంది. కానీ ఆ మార్పు మాటలతో కాదు—చర్యలతోనే సాధ్యం. పారదర్శక పాలన, ప్రజలతో మమేకం, అభివృద్ధికి స్పష్టమైన దిశ ఉంటేనే గ్రామాలు నిజంగా మారుతాయి. ఎన్నికలు ముగిశాయి; ఇక మొదలయ్యేది పాలన పరీక్ష. ఈ పరీక్షలో నూతన సర్పంచులు నిలబడగలరా? అన్నదే ఇప్పుడు తెలంగాణ గ్రామీణ ప్రజల ముందున్న ప్రశ్న.

# గట్టుభూత్కుర్ గ్రామ దేవాలయాల్లో చోరీ

**జనోదయ, చొప్పదండి ఆర్‌సీ (గంగాధర) డిసెంబర్ 19:** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గట్టుభూత్కూరు గ్రామంలోని దేవాలయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తేదీ 19122025న గట్టుభూత్కూరు గ్రామంలోని పెద్దమ్మ దేవాలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీ చేసి, దేవాలయంలో ఉన్న ఆరు గ్రాముల బంగారు పుస్తెలు, ఇత్తడి పళ్లెం, ఇత్తడి ప్రమిదలు, ఇత్తడి హారతి సామగ్రిని అపహరించారు. వీటి విలువ సుమారు రూ.20,000 వరకు ఉంటుందని తెలిపారు. అదే రోజు గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయంలో కూడా చోరీ జరిగింది. అక్కడ ఏడు గ్రాముల బంగారు పుస్తెలు, ఒక ముక్కు పోగు, ఒక ఇత్తడి హారతి ప్లేటు, రెండు ఇత్తడి ప్రమిదలను దుండగులు దొంగలించినట్లు సమాచారం. వీటి విలువ సుమారు రూ.22,000 వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ ఘటనలపై గంగాధర ఎస్సై వంశీకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# పీఏసీఎస్ పాలకవర్గాలు రద్దు – తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు

**జనోదయ – చొప్పదండి ఆర్‌సీ | డిసెంబర్ 19:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులతో పీఏసీఎస్‌లకు చెందిన చైర్మన్లు, డైరెక్టర్లు, ఇతర పాలకవర్గ సభ్యుల పదవులు తక్షణమే రద్దయ్యాయి. సహకార సంఘాల పనితీరులో పారదర్శకత పెంచడం, పరిపాలనలో సంస్కరణలు తీసుకురావడం, రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పాలకవర్గాల రద్దు నేపథ్యంలో తాత్కాలికంగా అధికారుల ఆధ్వర్యంలో సంఘాల నిర్వహణ కొనసాగనుందని సమాచారం. ఈ నిర్ణయంతో సహకార రంగంలో రాజకీయంగా చర్చలు మొదలయ్యాయి. భవిష్యత్తులో కొత్త పాలకవర్గాల నియామకం లేదా ఎన్నికలపై ప్రభుత్వం త్వరలో స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసే అవకాశముంది.




# సరస్వతి పుత్రిక వైద్య విద్యకు అండగా నిలిచిన మాజీ మంత్రి హరీష్ రావు

**జానోదయ, సిద్దిపేట, డిసెంబర్19:** సిద్దిపేటకు చెందిన నిరుపేద విద్యార్థిని మమత పీజీ వైద్య విద్య సాధనలో ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు గారు మానవతా దృక్పథంతో అండగా నిలిచారు.

మమతకు పీజీ మెడికల్ ఎంట్రన్స్‌లో సీటు రాగా, కళాశాల యాజమాన్యం ప్రతి సంవత్సరం రూ.7.50 లక్షల ట్యూషన్ ఫీజు చెల్లించాలని సూచించింది. బ్యాంకు రుణం కోసం ప్రయత్నించగా, ఆస్తి తనఖా పెడితేనే లోన్ మంజూరు చేస్తామని బ్యాంకర్లు స్పష్టం చేశారు. ఈ నెల 18వ తేదీ లోగా ఫీజు చెల్లించకపోతే సీటు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.

ఈ విషయం తెలుసుకున్న మమత, ఆమె తండ్రి





కొంక రామచంద్రం మాజీ మంత్రి హరీష్ రావు గారిని ఆశ్రయించారు. విషయం తెలిసిన వెంటనే ఎలాంటి ఆలస్యం చేయకుండా సిద్దిపేటలోని తన స్వగృహాన్ని బ్యాంకులో తనఖా పెట్టి రూ.20 లక్షల ఎడ్యుకేషన్ లోన్ మంజూరు అయ్యేలా హరీష్ రావు గారు చర్యలు తీసుకున్నారు. అంతేకాకుండా విద్యార్థిని హాస్టల్ ఖర్చుల కోసం స్వయంగా రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ఒకప్పుడు ఆటో కార్మికుల సంక్షేమం కోసం పోరాడిన హరీష్ రావు గారు, నేడు ఒక నిరుపేద విద్యార్థిని చదువు కోసం తన ఇంటినే తనఖా పెట్టి సమాజానికి ఆదర్శంగా నిలిచారు. విద్య అనేది దైవిక శక్తి అని, ప్రతిభకు ఆర్థిక అడ్డంకులు ఉండకూడదని మరోసారి నిరూపించారు.